ఘనంగా భోగి వేడుకలు


కొయ్యలగూడెంలో భోగి మంటలలో భోగి పిడకలను వేస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగ నేపథ్యంలో తొలి రోజున భోగి వేడుకను మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో భోగి మంటలను వెలిగించి వేడుకలు ప్రారంభించారు. స్థానికులు తమ ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న కలపను తీసుకువచ్చి భోగి మంటలలో వేశారు. అదే విధంగా చిన్నారులు భోగి పిడకలలను మాలగా కూర్చి భోగి మంటలలో అర్పించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి సూర్య భగవానునికి పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ సాంప్రదాయ వస్త్రధారణ నిర్వహించి భోగి మంటల వద్ద సందడి చేశారు.

జంగారెడ్డిగూడెంలో భోగి సంబరాలు

జంగారెడ్డిగూడెం : భోగభాగ్యాల భోగి పండుగను జంగారెడ్డిగూడెం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే భోగిమంటలు వేసి సంక్రాంతి పండుగను ఘనంగా ప్రారంభించారు. చీకటి తెరలు తొలగకముందే భోగివెలుగులు విరజిమ్మాయి. ప్రజలు కుటుంబసమేతంగా సాంప్రదాయ దుస్తుల్లో భోగిని నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. ఇళ్లకు దూరంగా ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు రావడంతో సంతోషంగా వేడుకలు నిర్వహించుకున్నారు.



మెట్టలో జోరుగా కోడి పందేలు


లింగపాలెంలో పుంజును వదిలి కోడిపందెం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


చింతలపూడి మండలం శ్రీనివాసపురంలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం


శ్రీనివాసపురంలో కోడిపందాలను వీక్షించేందుకు వచ్చిన నటుడు కొలగాని విజయ్


కొయ్యలగూడెం మండలం రామానుజపురం గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలు


జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో కోడి పందేలు ప్రారంభిస్తున్న దృశ్యం

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనివారం భోగి రోజు సంప్రదాయబద్ధంగా కోడి పందేలు నిర్వహించారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కృష్ణా, ఖమ్మం, తూర్పుగోదావరి, గుంటూరు, నల్గొండ, కర్నూలు జిల్లాల నుంచి కూడా కోడిపందేలను చూసేందుకు భారీ ఎత్తున తరలివచ్చారు.

లింగపాలెం : మండలంలోని లింగపాలెం, శింగగూడెం, అయ్యపరాజుగూడెం, ములగలంపాడు, బాదరాల,ఆశన్నగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో కోడిపందేలు తిరునాళ్లను తలపించాయి.

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలంలో శ్రీనివాసపురం, లక్కవరం, పేరంపేట, గురవాయిగూడెం, దేవులపల్లి గ్రామాల్లో పందేలు ప్రారంభించారు. శ్రీనివాసపురంలో సంఘు సేవకులు డీకేడీ సత్యనారాయణ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వ్యాపార వేత్త పరిమి సత్తిపండు పందేలను ప్రారంభించారు. అనేక ప్రాంతాల నుంచి ప్రజలు తరలి వచ్చి పందేలను వీక్షించారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా 15 చోట్ల కోడిపందేల నిర్వహించారు. గవరవరంలోకోడిపందేలు ఉత్సాహంగా సాగాయి. రామానుజపురంలో నిర్వహించిన కోడిపందేలకు తెలంగాణ రాష్ట్రంతోపాటు పలు జిల్లాల నుంచి వందల సంఖ్యలో పందేగాళ్లు హాజరయ్యారు.

పోలవరం రూరల్ : గూటాల, గుంజవరం ప్రాంతాల్లో శనివారం కోడిపందేలను నిర్వహించారు. అధిక సంఖ్యలో పందేలరాయుళ్లు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో కోడిపందాలు జోరుగా సాగాయి. స్థానిక సుబ్బంపేట రోడ్డులో రెండు ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహించారు. శ్రీనివాసపురంలో తెలుగు, తమిళ సినీ నటుడు కొలగాని విజయ్, సినీ నటి రవళి, టీవీ నటి హరిత శ్రీనివాసపురంలో నిర్వహించిన కోడిపందేలను తిలకించేందుకు వచ్చారు.

ద్వారకాతిరుమల: తిమ్మాపురం, పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, రాళ్లకుంట, దొరసానిపాడు, ద్వారకాతిరుమల, జి.కొత్తపల్లి, వేంపాడు గ్రామాల్లో పందేలను నిర్వహించారు. కొన్ని బరుల్లో రాత్రి వేళ సైతం ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందేలను నిర్వహించారు.

కుక్కునూరు: వేలేరు, చిరవెల్లి, కివ్వాక, దాచారం తదితర గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు.

శ్రీవారి సేవలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు స్వాగతం పలికారు.



ఇళ్ల స్థలాల పంపిణీ

పోలవరం రూరల్ : బీజేపీ రాష్ట్ర నాయకులు, నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య రూ.75 లక్షల సొంత నిధులతో కొనుగోలు చేసిన భూమిలో 65 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శికరిబండి నాగరాజు తెలిపారు. గూటాలలో కొనుగోలు చేసిన స్థలంలో లబ్ధిదారుని పేరు మీద పోలవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోరిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఆ స్థలాలకు సంబంధించిన దస్తావేజులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. పోలవరం మండల అధ్యక్షుడు కరిబండి ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు గ్రంధి బాలకృష్ణ పాల్గొన్నారు.



వైభవంగా గోదారంగనాథుల కల్యాణం


గోకుల తిరుమల పారిజాతగిరిలో గోదా రంగనాథుల కల్యాణం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం గోదా శ్రీ రంగనాథుల కల్యాణ మహోత్సవం ఆలయ కళ్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. ఈవో మానికల రాంబాబు, వెంకటప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొయ్యలగూడెం : స్థానిక శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం గోదారంగనాథుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శేషాచార్యులు పర్యవేక్షణలో కల్యాణ తంతు జరిపించారు. ఆలయ పాలక కమిటీ ఛైర్మన్ మద్దు గోపి దంపతులు దేవేరులతో సహా స్వామి వారికి తలంబ్రాలను పోశారు.

పోలవరం రూరల్ : గూటాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భోగిపండుగ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ సింహాద్రి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

మద్ది క్షేత్రంలో భక్తుల కిటకిట

జంగారెడ్డిగూడెం రూరల్ : భోగి పర్వదినం కావడంతో గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు జె.వరప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వరప్రసాద్‌కి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు.

సినిమా టికెట్ల కోసం ఘర్షణ

కొయ్యలగూడెం : సినిమా టికెట్ల కోసం థియేటర్ల నిర్వాహకులకి, ప్రేక్షకులకు మధ్య శనివారం వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. కొయ్యలగూడెంలో ఉన్న రెండు థియేటర్లలో ఇద్దరు అగ్ర నాయకుల సినిమాలు రిలీజ్ అయిన నేపథ్యంలో ప్రేక్షకులు వేలాదిగా థియేటర్ల వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టిక్కెట్ల స్లాబ్ ధరలకంటే రూ.50 ఎక్కువగా విక్రయిస్తుండడం, పరిమితికి మించి థియేటర్లో ప్రేక్షకులను అనుమతించడం వారికి తగిన సీటరింగ్ సౌకర్యం కల్పించకపోవడం ఘర్షణకు కారణమైందని ప్రేక్షకులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు థియేటర్ల వద్దకు చేరుకుని గొడవను సర్దుబాటు చేశారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

జంగారెడ్డిగూడెం రూరల్ : భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండల వ్యాప్తంగా భోగి మంటలు వేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. చల్లవారిగూడెం నిర్వాసిత కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వరక హేమశ్రీ,, ద్వితీయ స్థానం బద్దే రమాదేవి, తృతీయ స్థానం సాధించిన పెరుమాళ్ల శ్రావణికి బహుమతులను భద్రాచలం చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ వరక బాలరాజు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా మారుమూడి రామారావు, వీర బ్రహ్మం, వలపర్ల రామ్‌లాల్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు బద్దే ప్రేమ్‌కుమార్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ద్వారకాతిరుమల : సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో తాళ్ల పృధ్వీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో 8 టీంలు తలపడగా, అందులో విన్నర్‌గా నిలిచిన గుణ్ణంపల్లి టీంకు రూ.10 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ముల్లంగి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నీలకంఠేశ్వరరెడ్డి, అనూష్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, బొట్టా శివయ్య, ముల్లంగి సత్యన్నారాయణరెడ్డి తదితరులున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. 12 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు షీల్డ్స్ అందజేశారు. ఎంపీపీ సంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఐటీడీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్, పోలవరం ఎస్సై పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు.



